

అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో ఓటు హక్కు వినియోంచుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



కొల్లాపూర్‌లో సతీమణి బీరం విజయతో కలిసి ఓటు వేసిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలకు మొత్తం 50 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. రెండు పార్లమెంట్‌ల పరిధిలో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైంది. గతానికి భిన్నంగా ఈ సారి ఎంపీ ఎన్నికల్లో వలస ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాంతో పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని ఎదిర గ్రామస్థులు అమర్‌రాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరించారు.



భూత్పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఆయన సతీమణి



కడ్తాల్ మండలం చల్లంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్



కల్వకుర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి జే చిత్తరంజన్‌దాస్



ఓటు హక్కు వినియోగించుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



గుండూరులో ఓటు హక్కు వినియోగించుకున్న భరత్‌ప్రసాద్



ఊర్కొండ మండలం రేవల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి

పోటెత్తిన ఓటరు



మహబూబ్‌నగర్‌లో మొదటి సారి ఓటు వేసి సిరాచుక్క చూపుతున్న యువతులు



మహబూబ్‌నగర్‌లోని బోయపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల బారులు

- పాలమూరులో 72శాతం, నాగర్‌ర్నూల్‌లో 69.01శాతం పోలింగ్
- 2019 ఎన్నికలతో పోల్చితే భారీగా పెరిగిన ఓటింగ్
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం

స్థానం	శాతం
నాగర్‌కర్నూల్	63.56
వనపర్తి	66.56
జోగుళాంబ గద్వాల	74.93
అలంపూర్	73.11
కల్వకుర్తి	72.51
కొల్లాపూర్	64.00
అచ్చంపేట	64.88
మొత్తం	69.01

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం

స్థానం	శాతం
కొడంగల్	71.5
షాద్‌నగర్	77.42
దేవరకద్ర	73.47
జడ్చర్ల	76.70
మహబూబ్‌నగర్	65.35
మక్తల్	70.85
నారాయణపేట	68.71
మొత్తం	72.00

మహబూబ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చెదురుమదురు ఘటనలు, పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు.. రెండు చోట్ల ఓట్ల బహిష్కరణ మినహా మిగతా చోట్ల పోలింగ్ ఆటంకాలు లేకుండా పూర్తయ్యింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల పరిధిలో ఏడేసి నియోజకవర్గాలు ఉండగా.. అన్నిచోట్లా మూడు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ముందు నుంచీ ఈ రెండు స్థానాల్లో గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో గెలవడం ద్వారా రేవంత్‌రెడ్డిని సొంత జిల్లాలో దెబ్బతీసినట్లు అవుతుందని భావించడం, గతంలో కంటే పెరిగిన యువ ఓటర్లపై ఆశలు పెట్టుకోవడం వంటి అంశాలతో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. వేకువజామున కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటం కూడా ఓటింగ్ పెరగడానికి ఒక విధంగా కలిసి వచ్చిందని చెప్పొచ్చు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మొదట్లో మందకొడిగా సాగిన పోలింగ్.. తొమ్మిది గంటల నుంచి అంతకంతకూ పెరుగుతూ పోయింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో ఉదయం తొమ్మిది గంటలకు 10.33 శాతం పోలింగ్ నమోదు కాగా.. 11 గంటల సమయానికి 26.99 శాతానికి పెరిగింది. ఒంటి గంటకు 45.84 శాతం నమోదు కాగా.. మూడు గంటలకు 58.92, సాయంత్రం ఐదు గంటల వరకు 68.40 శాతం నమోదైంది. పోలింగ్ సమయం ఆరు గంటల వరకు ఉండగా, ఆ సమయం వరకు కేంద్రాల్లోకి వచ్చిన వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆరు దాటిన తర్వాత కూడా ఓటర్లు క్యూలైన్లో ఉండటంతో ఓటింగ్ పూర్తయ్యే సమయానికి 72 శాతం పోలింగ్ నమోదైంది. అమర్ రాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఎదిర నాలుగో వార్డులో పోలింగ్‌ను బహిష్కరించారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా ఓటు వేయలేదు. పదర మండలం వట్టువర్లపల్లిలో ఓటు వేయడానికి ప్రజలు కొంతసేపు నిరాకరించినప్పటికీ.. ఆ తర్వాత వివాదం సద్దుమణిగి ఓటు వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ సింబల్ కారుపై ఇంకుతో కనిపించకుండా చేశారనే వివాదం నెలకొంది. గొడవలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. కోస్గి మండలంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ.. పోలింగ్ కేంద్రంలోకి కండువాతో వెళ్లారని సీ విజిల్‌లో ఫిర్యాదు నమోదైంది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో ఒక వ్యక్తి డబ్బులు పంచుతున్నారనే కారణంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



చిన్నారి ఎత్తుకొని విధులకు వచ్చిన మహిళా పోలీసు



కొండనాగులలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చొన్న ఓటర్లు

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు

పోలింగ్ పూర్తయిన వెంటనే నాగర్‌కర్నూల్‌కు సంబంధించిన ఈవీఎం మిషన్లను ఆ జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంకు తరలించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను పాలమూరు యూనివర్సిటీకి తరలించారు. ఆయా జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలించి.. డిపాజిట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు.

గతం కంటే పెరిగిన పోలింగ్

2019 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే.. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదైంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 2019లో 65.39 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 72 శాతం పోలింగ్ నమోదైంది. 6.61 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి వచ్చిన 2014 పోలింగ్ శాతం కూడా ఇంచుమించుగా ఇదే విధంగా నమోదైంది. 2014లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 72.94 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్లమెంట్ పరిధిలో 16,82,470 ఓట్లు ఉండగా.. 72 శాతం పోలింగ్ నమోదై.. 12,11,378 ఓట్లు పోలయ్యాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 2019 ఎన్నికల్లో 62.23 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 69.01 శాతం నమోదైంది. గతంలో కంటే 6.78 శాతం పోలింగ్ పెరిగింది. 2014 కంటే కొంత తక్కువ నమోదైందని చెప్పవచ్చు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,34,773 మంది ఓటర్లు ఉండగా.. 11,97,166 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు పార్లమెంట్‌ల పరిధిలో కలిపి 34,17,243 మంది ఓట్లు ఉండగా.. 24,08,544 మంది ఓటు వేశారు. దాదాపు 10.08 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు.



గౌరారంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



తెలకపల్లి మండల కేంద్రంలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి



కొల్లాపూర్‌లో సతీమణి సృజనతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కాంగ్రెస్‌కే మెజార్టీ స్థానాలు

- బీఆర్ఎస్ పార్టీకి సున్నా - కేంద్రంలో ఎన్‌డీఏ కూటమిదే అధికారం
- ప్రధాని కాబోతున్న రాహుల్‌గాంధీ - మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 13 : ఎంపీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకే మెజార్టీ స్థానాలు వస్తున్నాయని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి సున్నా స్థానాలే వస్తాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన సతీమణి సృజనతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేళ్ల బీజేపీ పరిపాలనలో జరిగిన సంక్షేమం శూన్యమని, మతం పేరుతో విద్వేషాలు సృష్టించారని ధ్వజమెత్తారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ ఐదువేల కిలో మీటర్ల మేర భారత్‌జోడో యాత్ర నిర్వహించారని, రెండవ దశలో భారత్ న్యాయయాత్ర చేపట్టి దేశ ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందాలంటే, దేశం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు.

కొల్లాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని, ప్రధానంగా విద్యారంగంపై దృష్టి పెడతానని తెలిపారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలను గురుకులంగా మారుస్తానన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన అభివృద్ధి పనులన్నింటినీ తిరిగి ప్రారంభిస్తానని చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మునిసిపల్ కౌన్సిలర్ సిబ్బది నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామిగౌడ్, సుధాకర్‌సింగ్, సురేందర్, చిట్టిబాబు, శేఖర్, రాజు, ప్రకాశ్, వెంకటేశ్‌యాదవ్, కాటమోని రమేష్‌గౌడ్, పసుల వెంకటేశ్, చింటు, మహబూబ్, స్వామి పాల్గొన్నారు.

ఓటర్లపై తేనెటీగల దాడి



వటువర్లపల్లిలో ఆరోగ్య కేంద్రంలో బాధితులు

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో సోమవారం ఓటు వేసేందుకు వెళ్తున్న గ్రామస్థులపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఒక చెట్టుకు తేనె తుట్టె ఉంది. ఆ తేనె తుట్టెను ఆకయితాలు రాయితో కొట్టారు. దాంతో తేనెటీగలు గ్రామంలోకి వచ్చి, గ్రామస్థులపై దాడి చేశాయి. తప్పించుకోడానికి ప్రజలు పరుగులు తీశారు. 30 మందిపై దాడి చేయగా.. కొర్ర తిరుపతి, వర్త్యావత్ గణేష్, వర్త్యావత్, మౌనిక, కరంటోత్ సింధు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారితో పాటు రాజు, ప్రవీణ్, సాయిబాబు, బాలరాజు, మల్లయ్య, రాజేష్, జైపాల్, సూర్యం, శివ, మల్లేష్ చికిత్స పొందారు.

పోలింగ్ కేంద్రం వద్ద మహిళకు మూర్ఛ



మూర్ఛ వచ్చిన మహిళకు సపర్యలు చేస్తున్న పోలీసు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఓటు వేయడానికి వచ్చిన మహిళకు మూర్ఛ వచ్చింది. ఆమె కింద పడుతుండగా కానిస్టేబుల్ పట్టుకున్నారు. ఆమె చేతిలో తాళం చెవులు పెట్టారు. ఏఎన్ఎం మహిళ ముఖంపై నీళ్ల చల్లి, మాత్ర వేయడంతో ఆమె కోలుకున్నారు.

గద్వాల చీరలు ధరించిన సిబ్బంది



గద్వాల పోలింగ్ కేంద్రంలో చేనేత జరీ చీరలు ధరించి విధుల్లో పాల్గొన్న సిబ్బంది

గద్వాల న్యూ టౌన్: జోగుళాంబ గద్వాల పురపాలిక పరిధిలోని జమ్మిచేడు గ్రామంలోని, అలంపూర్‌లోని మహిళా పోలింగ్ కేంద్రాల్లో నలుగురు చొప్పున మహిళా సిబ్బంది గద్వాల చేనేత జరీ చీరలు ధరించి, విధుల నిర్వర్తించారు. స్వీప్(సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిస్పేషన్) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా నేసిన ఆ చీరలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ వారికి అందజేశారు. చీరల కొంగులపై హెచ్‌వోపీ(హౌస్ ఆఫ్ పార్లమెంట్) ఎలక్షన్ 2024, జోగుళాంబ గద్వాల జిల్లా అని రాసి ఉంది. ఈ చీరలు మహిళా ఓటర్లను ఆకట్టుకున్నాయి.

నాగర్‌కర్నూల్‌లో ప్రశాంతం

- చెదురుముదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతం
- కోడేరులో మొరాయించిన ఈవీఎం
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు
- తూడుకుర్తిలో ఓటు వేసిన కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



తూడుకుర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు



ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ దంపతులు

నాగర్‌కర్నూల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. స్వల్ప ఘటనలు మినహా పెద్దగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో గద్వాల, అలంపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్లుండగా పోలింగ్ ముగిసే సమయానికి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ 70.23శాతం నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ 10శాతానికి తగ్గింది. తెల్లవారుజాము నుంచి వర్షం కురియడంతో ఓటర్లు ఆలస్యంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం మందకొడిగా ప్రారంభమైనప్పటికీ సాయంత్రం 4గంటలకల్లా ఊపందుకుంది. గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లో ఆ పరిస్థితి స్పష్టంగా కన్పించింది.

రూరల్ ఏరియాల్లో కూడా ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా ప్రారంభం కావడం గమనార్హం. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. 17లక్షల 38వేల 254మంది ఓటర్లుండగా కేవలం 70.23శాతం ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. తగ్గిన ఓటు శాతంతో ఏ రాజకీయ పార్టీకి ప్రయోజనం చేకూరుతుందనే విషయంలో రాజకీయ విశ్లేషణలు జరుగుతున్నాయి. త్రిముఖ పోటీ బలంగా ఉన్న నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో రాజకీయంగా తమకు లాభం చేకూరుతుందని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు భావిస్తున్నాయి.

● కోడేరులో మొరాయించిన ఈవీఎం

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు సంతృప్తినిచ్చాయి. అయితే కొల్లాపూర్ మండలం అమరగిరి చెంచు గూడెంలో స్థానిక సమస్య కోడేరులో ఈవీఎం మొరాయించడంతో స్వల్పంగా ఓటింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగింది. అమరగిరి చెంచుగూడెంలో నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో ఆగ్రహించిన గూడెం వాసులు ఓటింగ్ ప్రక్రియను బహిష్కరించి ఆందోళన వ్యక్తం చేయడంతో రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ గ్రామస్థులతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించి ఓటింగ్ ప్రక్రియలో పాలుపంచుకునే విధంగా చేశారు.

● ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో ప్రముఖులు తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి తూడుకుర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తిమ్మాజిపేట మండలం నేరేళ్లపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయగా కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయగా అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్పీటీసీ అనురాధ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అచ్చంపేటలో ఎంపీ రాములు ఓటు వేయగా, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి కల్వకుర్తి మండలం గుండూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ కూడా కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పోలింగ్ ముగిశాక స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకెళ్తున్న ఈవీఎంలు

దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్

- మేడిపూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద యువకుడిపై చేయి చేసుకున్న వైనం - డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో క్షమాపణ చెప్పిన కానిస్టేబుల్

తాడూరు, మే 13 : ఎన్నికల విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. ఓ యువకుడిపై చేయి చేసుకోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు కానిస్టేబుల్ రామచంద్రయ్య వచ్చారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి గ్రామస్థులతో దురుసుగా ప్రవర్తిస్తూ వచ్చాడు. అటుగా వచ్చిన వారిని అసభ్య పదజాలంతో దూషించాడు. సాయంత్రం గ్రామానికి చెందిన సతీష్ (తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యుడు) అనే యువకుడు తన ఓటు హక్కును వినియోగించుకొని వస్తున్న క్రమంలో కానిస్టేబుల్ అసభ్యపదజాలంతో దూషించి చేయి చేసుకున్నాడు. దీంతో గ్రామస్థులందరూ ఒక్కసారిగా అసహనం వ్యక్తం చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలానికి ఎస్ఐ మహేష్ చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్న క్రమంలోనే డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సైతం పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. జరిగిన సంఘటనను తెలుసుకున్న డీఎస్పీ కానిస్టేబుల్ దురుసుతనంతోనే ఈ పరిస్థితి నెలకొందని తెలుసుకొని అందరి సమక్షంలోనే యువకుడికి క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

సీబీఎస్ఈ ఫలితాల్లో మౌంట్‌బాసిల్ ప్రభంజనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 13 : సీబీఎస్‌సీ బోర్డు సోమవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఏ-1 గ్రేడ్ 32 మంది విద్యార్థులు, ఏ-2 గ్రేడ్ 74 , బీ-1 గ్రేడ్ 40, బీ-2 గ్రేడ్ 34మంది విద్యార్థులు సాధించారు. ఎస్. సాయి ప్రసూనాంబ 500 మార్కులకు గాను 491 మార్కులతో జిల్లామొదటి స్థానంలో నిలిచారు. ఆర్.కిషోర్ 489 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. బినయు చందన మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారని హర్షంవ్యక్తం చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న మౌంట్ బాసిల్ పాఠశాల యాజమాన్యం

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్‌పర్సన్ చంద్రకళా వెంకటయ్య, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, డైరెక్టర్ శిరీష ప్రవీణ్, సుశాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, వైస్‌ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో 491 మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. కష్టపడి చదివా, పాఠశాల ఉపాధ్యాయులు ఎంతగానో ప్రోత్సహించారు. జేఈఈలో జాతీయస్థాయిలో మంచి ర్యాంక్ సాధించి ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

- సాయిప్రసూనాంబ, జిల్లా టాపర్

సీబీఎస్‌సీ ఫలితాల్లో సమర్థ పాఠశాల విద్యార్థుల జయకేతనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 13 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల విద్యార్థులు సోమవారం విడుదల అయిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారు. వందశాతం ఫలితాలు సాధించి తమ సత్తాచాటారు. 30శాతం మంది విద్యార్థులు 90శాతం పైగా మార్కులు సాధించారు. 75శాతం విద్యార్థులు 80శాతానికిపైగా మార్కులు సాధించారు. మోక్షితాంజలి 480 మార్కులు (96శాతం), వంశికరామ్ 478 (96 శాతం), శ్రీధన్య 475 మార్కులు (95శాతం) సాధించారు. పాఠశాల ప్రిన్సి పాల్ శ్రీకాంత్ కోటా, డైరెక్టర్స్ నరేంద్రగుప్త, యాదయ్యగుప్త విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దండ, మే 13 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో చెర్కూర్ గేట్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం బోల్తాపడటంతో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన కిరణ్ తన ఓటుహక్కు వినియోగించుకొని వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కిరణ్‌కు గాయాలు కాగా స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఈవీఎంల తారుమారు

- ఆత్మకూరు పట్టణంలోని 207 బూత్‌లో అరగంట పాటు నిలిచిన పోలింగ్

- డీఎస్పీ కృష్ణ కిషోర్ చొరవతో యథావిధిగా పోలింగ్

ఆత్మకూరు,మే13: ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 207 బూత్‌లో ఈవీఎంలు తారుమారుగా ఏర్పాటు చేయడంతో ఓటర్లు గుర్తించి పోలింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జాతీయ పార్టీలకు చెందిన గుర్తులను సూచించే ఈవీఎం మొదటి వరుసలో ఉంచాలనే ఆదేశాలు ఉన్నాయి. ఆ తరువాత స్వతంత్ర అభ్యర్థుల ఈవీఎంను రెండవ ఈవీఎంగా పరిగణించే పక్కలోనే ఉంచాలి అలా కాకుండా స్వతంత్ర అభ్యర్థుల ఈవీఎంను మొదటి వరుసలో ఉంచి జాతీయ పార్టీలకు చెందిన ఈవీఎంను రెండవ వరుసలో ఉంచారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మధ్యాహ్నం తరువాత ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు గుర్తించారు. ఈ విషయంపై ఆయా పార్టీల నాయకులకు ఓటర్లు తెలపడంతో నిర్లక్ష్యంగా ఉన్న పోలింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో డీఎస్పీ కృష్ణ కిషోర్ , సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ కలుగజేసుకుని ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందించి యథావిధిగా పోలింగ్ కొనసాగించాలని ఆయా పార్టీల నాయకులకు సూచించడంతో సమస్య సద్దుమణిగింది.


ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణ కిషోర్

పిడుగు పడి మిరప కుప్ప దగ్ధం

కేటీదొడ్డి, మే 13: పిడుగు పడి మిరపపండు కుప్ప దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం అర్ధ రాత్రి గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని పాగుంట గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాగుంట గ్రామానికి చెందిన కురువ సిద్ధప్ప నాలుగు ఎకరాల పొలంలో సీడ్ మిరప (బ్యాగడ) పంటను సాగు చేశాడు. పంటను తెంపగా 45 క్వింటాళ్లకు పైగానే అయింది. పంటను మొత్తం పొలం దగ్గర నిలువ చేశాడు. రాత్రి ఉరు ములతో కూడిన పిడుగు నిల్వ చేసిన మిరప కుప్పపై పడడంతో పంట మొత్తం కాలిపోయింది. దాదాపు రూ.8,50,000 విలువ ఉంటుంది. చేతికి వచ్చిన పంటను నిల్వ చేయగా పిడుగు పడి మొత్తం మంటల్లో కాలి బూడిదయిందని ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


దగ్ధమవుతున్న మిరప

పిచ్చికుక్కదాడిలో పది మందికి గాయాలు

కోడేరు, మే 13 : పిచ్చికుక్కల దాడిలో పదిమందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని నర్సాయిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం... గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో పలువురు ఓటు వేయడానికి వెళ్తుండగా పిచ్చికుక్క తాళ్ల చంద్రమ్మ, చిట్టమ్మ, నాగేంద్రమ్మ, ఎదుట్ల లక్ష్మీ, కృష్ణ, వీరితోపాటు మరో ఐదు మందిని కరిచి గాయపర్చింది. చుట్టు పక్కల వారు చూసి వెంటనే చికిత్స నిమిత్తం బాధితులను కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఊర్లో కుక్క బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నల్లమలలో వర్షం

దోమలపెంట, మే 13: నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి పరిసర ప్రాంతంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి జనాలకు కొంత ఉపశమనం కలిగింది. రైతులు దుక్కులు దున్నుకునేందుకు అదును ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వటువర్లపల్లిలో వర్షం కురిసిన అనంతరం ఇంద్ర ధనస్సు ఏర్పడంతో చూపరులను ఆకట్టుకుంది.

బీజేపీ అభ్యర్థిపై పోలీసులకు ఫిర్యాదు

కోస్గిరూరల్, మే13: ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంలోని అభ్యర్థి కండువా వేసుకొని వెళ్లవద్దని నిబంధనలు ఉన్నా బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి కండువా వేసుకొని వెల్లడంపై సీవిజిల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కోస్గిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అయితే పోలింగ్ కేంద్రంలోకి కండువా వేసుకొని వెల్లడంతో సీవిజిల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇస్తామని ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపారు.

ఓటు కోసం అమెరికా టు ఇండియా


కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఎన్నారై అమరేందర్‌రెడ్డి

ఉప్పునుంతల, మే 13: ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓ ఎన్నారై అమెరికా నుంచి కుటుంబ సమేతంగా ఇండియాకు వచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధి లోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ అమరేందర్‌రెడ్డి ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటున్నారు. స్వదేశంలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వగ్రామానికి రావడంతో పలువురికి ఆదర్శంగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోస్గిరూరల్, మే13: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన కోస్గి శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వికారాబాద్‌జిల్లా దౌల్తాబాద్ మండలం బిచ్చాల గ్రామానికి చెందిన విష్ణుగౌడ్(19), భాస్కర్‌గౌడ్ ఇరువురు ద్విచక్రవాహనంపై కోస్గిలోని స్విమ్మింగ్‌ఫుల్‌వద్దకు వచ్చి ఈతకొట్టి తిరిగి స్వగ్రామానికి వెళ్తడగా దౌల్తాబాద్ మార్గలోని మైసమ్మగుడి సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో విష్ణుగౌడ్ మృతి చెందాడు. భాస్కర్‌కు గాయాలయ్యాయి. వెంటనే కోస్గి ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపారు.

పేరుకే 50 పడకల ఆసుపత్రి

- కానరాని కనీస వసతులు

- మందులు లేక రోగులకు తప్పని తిప్పలు

- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

కోస్గి రూరల్, మే 13 : కోస్గి ప్రభుత్వాసుపత్రి పేరుకే 50 పడకల ఆసుపత్రి. రోగులు బారులు తీరుతున్నా.. అక్కడ కనీస వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కార ణంగా ఆసుపత్రి నిర్మాణమే ఆరు సంవత్సరాలైంది. ఎన్నికల ముందు హడావుడిగా ఆసుపత్రిని ప్రారంభించినా సిబ్బంది కొరతతో పాటు మందులు సరఫరా కాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఏ మందులు అడిగిన తమ వద్ద లేవని, బయట తీసుకొని రావాలని వైద్యులు చీటి రాసి ఇస్తున్నారు. ప్రసవానికి మహిళలు వస్తే గైనిక్ డాక్టర్ ఎప్పుడు ఉంటారో ఎవరికి తెలియదు. విధుల్లో ఉన్న డాక్టర్లు నర్సుల ద్వారా డెలివరీలు చేస్తున్నారు. ఈ ఆసుపత్రి వైపు జిల్లా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ముఖ్యమంత్రి పర్యటన రోజు ఉన్న తాధికారులు వచ్చి పర్యవేక్షించి అపరిశుభ్రంగా ఉంటే ఎలా? ఆసుపత్రిలోని మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉంచుకోరా? అంటూ మండిపడ్డారు. ఇక ఈ ఆసుపత్రి పరిస్థితే ఇలా ఉంటే పీహెచ్‌సీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.



కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి

100పడకలకు అప్‌గ్రేడ్ చేస్తేనే..

కోస్గి ఆసుపత్రిని 100పడకలకు మార్చాలని అందుకు అధికారలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రపోజల్స్ పంపాలని ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. కోడంగల్ కాడ అధికారి వెంకట్‌రెడ్డి ఈవిషయంపై నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్తాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు సేవలు అందించాలి. కాని గత ప్రభుత్వంలా కాకుండా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరువ చూపితే ఈ ఆసుపత్రి స్థితిగతులుమారుతాయి.

మందులు సరఫరా కావడం లేదు

ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి మందులు సరఫరా కావడం లేదు. మేమేమి చేయలేము. ప్రభుత్వం సరఫరా చేస్తే అందిస్తాం.

- డాక్టర్ రంజిత్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఓట్ల పండుగ

పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ముగిసింది. నూతనంగా ఓటు హక్కు వచ్చిన వారితో పాటు యువకులు, మహిళలతో పాటు వృద్ధులు సైతం ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నడవలేని వారు కూడా కుటుంబసభ్యుల సహాయంతో కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగిన పోలింగ్‌కు సంబంధించిన 'దృశ్యమాలిక' మీ కోసం...



నారాయణపేటలో ఓటు వేసేందుకు తాతను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న బాలుడు



నారాయణపేటలో ఓటు ఓటు వేసి వస్తున్న వృద్ధురాలికి మెట్లు దిగేందుకు సాయం చేస్తున్న కానిస్టేబుల్



మహబూబ్‌నగర్ పట్టణంలో పోలింగ్ బూత్‌ల పరిశీలనకు బైక్‌పై వెళ్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



వనపర్తి జిల్లా రాజనగరంలో ఓటు హక్కు వినియోగించుకొని, వేలిపై సిరా గుర్తును చూపుతున్న వృద్ధులు



మక్తల్ : తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతి



వనపర్తి పట్టణంలో ఓటేసి పనికి వెళ్తున్న డెలివరీ బాయ్



కొండేరులో ఓటు వేసి, వేలిపై సిరా గుర్తు చూపుతున్న ఎన్ఆర్ఐ దంపతులు



వనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో తన మొదటి ఓటు వేసిన బాలింత. ఈ కేంద్రంలో ఈమెదే చివరి ఓటు కావడం విశేషం


నారాయణపేటలో ఓటు వేసి, వేలిపై సిరా గుర్తు చూపుతున్న వృద్ధులు



ఊట్కూరులో పోలింగ్ కేంద్రానికి ఆటోలో వచ్చిన వృద్ధురాలికి సాయం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుడు



మహబూబ్‌నగర్ పట్టణంలోని మోడల్ బేసిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న దంపతులు



ధరూరు మండలంలోని బుడ్డందొడ్డిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్‌లోఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


ఊట్కూర్ మండలం, పెద్దజట్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు, పురుషులు

పోలింగ్ బహిష్కరణ

- ఓటు హక్కు వినియోగించుకోని ఎదిర గ్రామస్థులు
- అమర్‌రాజా పరిశ్రమను తరలించాలని పట్టు
- ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు సంఘటనలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 13 : అమర్‌రాజా పరిశ్రమను వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎదిర గ్రామస్థులు ఓటింగ్‌ను బహిష్కరించారు. గ్రామస్థులంతా ఓటింగ్‌కు దూరంగా ఉంటామని ముందుగా చెప్పిన ప్రకారం ఊరకంతా ఏకతాటిపై నిలిచి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. కాగా ఎదిర గ్రామంలో 94,95,96 బూత్‌ల్లో హౌసింగ్ బోర్డ్‌కాలనీకి చెందిన 300 ఓట్లు ఉండగా వాళ్లను మాత్రం ఓటు వేసేందుకు గ్రామస్థులు అంగీకరించారు. తొలుత వాళ్లను కూడా ఓటు వేయొద్దని గ్రామస్థులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని హౌసింగ్‌బోర్డ్‌కాలనీ ఓటర్లు ఓటువేసేందుకు గ్రామస్థులకు నచ్చచెప్పడంతో కొందరు ఓటేసి వెళ్లారు. మొత్తంగా ఇక్కడ 3299ఓట్లకు గాను 128 ఓట్లు మాత్రమే పోల య్యాయి. పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్రబలగాలను మోహరించి ఎవరినీ లోపలికి అనుమతించకుండా అడ్డుకున్నారు.

అమరగిరి చెంచుగూడెంలో చెంచుల నిరసన

కొల్లాపూర్, మే 13 : కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామంలోని చెంచుగూడెంలో నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. సోమవారం విద్యుత్ సమస్య పరిష్కారమయ్యేంత వరకు తాము ఓటు వేయబోమని చెంచుగూడెం చెంచులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చెంచులు మాట్లాడుతూ చెంచుగూ డెలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. నాలుగు రోజుల క్రితం ఈదురుగాలులకు చెంచుగూడెంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. తాము ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే గ్రామాలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు వెంటనే సిబ్బందిని పంపించి చెంచుగూడెంలో విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించడంతో చెంచులంతా ఓటు వేశారు.

మొరాయించిన ఈవీఎంలు

దోమలపెంట: అమ్రాబాద్ మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్ 226ఏ (వటువర్లపల్లి) రాయిలేటిపెంటలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 8గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా, 229బీ (దోమలపెంట) ఇంక్లాండ్ టన్నెల్‌లో (మత్స్యకారుల కాలనీ) ఈవీఎం మొరాయించడంతో ఉదయం 10 గంటలకు సరి చేసినప్పటికి ఓటర్లు మధ్యాహ్నం 12 గంటల తరువాత ఓటు వేసేందుకు వచ్చారు. ఎడమ పాతాళగంగ, దోమలపెంట ఇంక్లాండ్ టన్నెల్‌లో (మత్స్యకారుల కాలనీ) ఉన్న చాలా మందికి ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు కలిగి ఉండటంతో సుండిపెంటలో ఓటు వేసిన అనంతరం ఇక్కడ ఓటు వేసేందుకు ఆసక్తి చూపించడంతో ఇక్కడ కొంత ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభం కావడం విశేషం. వటువర్లపల్లిలో 1149 ఓట్లకు గాను 705 ఓట్లు పోలయ్యాయి, రాయిలేటిపెంటలో 32కు, 28 ఓట్లు పోలయ్యాయి, ఇంక్లాండ్ టన్నెల్‌లో 45 ఓట్లలకు గాను 25 పోలయ్యాయి. ఎడమ పాతాలగంగలో 201 గాను 134 పోలయ్యాయి. ఈగలపెంటలో 299 గాను139 పోల్ కాగా, దోమలపెంటలో 966కు 398 ఓట్లు పోలయ్యాయి. సార్లపల్లిలో 430 గాను, 190 పోలయ్యాయి. కుడిచింతలబావిలో 280గాను 191 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

కోడేరు : మండల కేంద్రంలోని 74వ పోలింగ్ బూత్‌లో దాదాపు ఉదయమే రెండు గంటలు ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ బూత్ దగ్గర ఓటర్లు గుమ్మి గూడి ఒక దశలో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఓటర్లు తమ ఓటును వినియోగించు కున్నారు.

పైపాడు పోలింగ్ బూత్‌లో ఘర్షణ

వడ్డేపల్లి, : గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ గ్రామమైన పైపాడు 167బూత్‌లో ఈవీఎం మిషన్‌పై ఉన్న కారు గుర్తుపై పెన్ను మార్కర్ దిద్దడం వల్ల ఓటర్ల మధ్య గొడవ చోటు చేసుకున్నది. పోలింగ్ బూత్‌లో 1196 ఓటర్లు ఉండగా 848 ఓట్లు పోల్‌కాగా అనంతరం కొందరు ఓటర్లు గమనించి విషయాన్ని తెలియజేయడంతో పోలింగ్‌ను నిలిపివేశారు. స్థానిక పోలీసులు ఎస్పీ రితిరాజ్‌కి సమాచారం అందించడంతో ఆమె హుటాహుటిన పోలింగ్ బూత్‌కు చేరారు. పోలింగ్ కేంద్రం వద్ద గుమ్మిగూడిన ఓటర్ల చెదరగొట్టి పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఈవీఎంపై ఉన్న కారు గుర్తుపై ఉన్న మార్కును తుడిపివేసి యథావిధిగా ఎన్నికలు జరిపించారు. కాగా అంతకుముందు కారు గుర్తుకు పెన్నుమార్కర్‌తో దిద్దారని ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి పోలీసులను ప్రశ్నించగా, వారు దురుసుగా మాట్లాడారని వాపోయారు. పోలీసులపై పైస్థాయి అధికారులకు, ఈసీకి ఫిర్యాదు చేస్తాన ఎంపీటీసీ తెలిపారు. కారు గుర్తుపై మార్కర్‌ను దిద్దారని ఓటర్లు అంటున్నారని విలేకర్లు ప్రశ్నించగా ఆ విషయం పోలింగ్ ఆఫీసర్‌కు తెలుసని ఎస్పీ అక్కడి నుంచి వెళ్లిపోయారు.


నిర్మానుష్యంగా ఉన్న ఎదిర గ్రామ వీధి


పైపాడు పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న గద్వాల ఎస్పీ రితిరాజ్


ఈవీఎంపై ఉన్న కారు గుర్తును మార్కర్‌తో దిద్దిన దృశ్యం


అమరగిరిలో గ్రామస్థులు నిరసన వ్యక్తం చేయడంతో విద్యుత్ సమస్యను పరిష్కరిస్తున్న సిబ్బంది


కోడేరు పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో వేచి చూస్తున్న ఓటర్లు


అమరగిరి చెంచుగూడెంలో ఓటు వేయకుండా నిరసన తెలుపుతున్న చెంచులు

కంపెనీ తరలించాలి



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ తరలించాలన్నదే మా డిమాండ్. గతంలో రాజ్‌వీర్ కలర్ డయింగ్ ప్లాంట్ నుండి భూమి, నీరు,గాలి కాలుష్యమై 20 సంవత్సరాలుగా అనర్థాల కు ఎదుర్కొంటున్నాం. పార్టీలకు అతీతంగా అందరు కలిసి పార్లమెంట్ ఎన్నిలను బహిష్కరించాం.

- బి.శివశంకర్, మాజీ కౌన్సిలర్

ఎవరూ స్పందించలేదు



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ తరలించాలని 59 రోజులుగా దీక్షలు చేపడుతన్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం స్పందించ లేదు. గ్రామస్థు లంతా ఏకతాటిపై పార్లమెంట్ ఎన్నికలు బహిష్కంచాలి తీర్మానం చేసుకున్నాం. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు.

- సుధా నర్సింహులు, ఎదిర

జలకాలుష్యంతో పంటలు పండవు



ఎదిర శివారులో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే, జల, వాయుకాలుష్యం ఏర్పడుతుంది. తద్వారా భూగర్భ జలాలు కలుషితం అయ్యి పంటలు పండవు. చెరువులు, కుంటల్లోని నీరు విషతుల్యంగా మారే అవకాశం ఉంటుంది. వాయుకాలుష్యంతో శ్వాసకోశ వ్యాధుల పాలుకావాల్సి వస్తుంది. పోలింగ్‌లో పాల్గొనకపోవటం బాధగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ప్రజలకు ఎదురయ్యే సమస్యల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం.

- అబ్దుల్‌హకీం, ఎదిర

ప్రాణాలతో చెలగాటం



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ వస్తే మా ప్రాణాలతో చెలగాటమే. 59 రోజులు పార్టీలకు అతీతంగా దీక్షలు చేస్తున్నాం. కంపెనీ తరలే వరకు పోరాటం కొనసాగుతుంది. గ్రామపెద్దలు, యువకులు ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి ఎన్నికలు బహిష్కరించారు.

-భానుచందర్,ఎదిర

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని దేవినేనిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం దగ్గర ఒక వ్యక్తిపై మరొక వ్యక్తి దాడి చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. దేవినేనిపల్లి గ్రామానికి చెందిన బీరయ్యపై అదే గ్రామానికి చెందిన శివ పాత కక్షలు మనసులో పెట్టుకుని పోలింగ్ కేంద్రం దగ్గర దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతం

జిల్లాలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటు వేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కల్వకుర్తి, మే 13 : కల్వకుర్తి నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఏఆర్‌వో ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 271పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. కల్వకుర్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 44వేల 405మందికి గాను ఉదయం 9 గంటల వరకు 11.31శాతం ఓటు హక్కును వినియోగించుకోగా సాయంత్రం 5గంటల వరకు లక్షా 70వేల 656మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 5గంటల వరకు 69.83 శాతం నమోదైంది. సాయంత్రం 6గంటలకు తర్వాత 72.51 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఏఆర్‌వో, ఆర్డీవో ఎస్‌శ్రీను తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్‌తోపాటు చారకొండ మండలంలోని ఆరు గ్రామాల్లో 271పోలింగ్ కేంద్రాల్లో ఓటరు ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను పోలీసుల బందోబస్తు నడుమ 27రూట్లలో ప్రత్యేక వాహనాల్లో స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించినట్లు ఏఆర్‌వో, ఆర్డీవో ఎస్‌శ్రీను తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

● పోలింగ్ సరళిని పరిశీలించిన ఎంపీ అభ్యర్థులు

కల్వకుర్తి నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఆయా పార్టీల కార్యకర్తలతో మమేకమయ్యారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే, ప్రముఖులు

కల్వకుర్తి నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల 37వ బూత్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆయన సతీమణి మాధవిరెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ కడ్తాల మండలం చల్లంపల్లి గ్రామంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఆమనగల్లు పట్టణంలో మాజీ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆయన సతీమణి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి పట్టణంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ దంపతులు ఓటును సద్వినియోగం చేసుకోగా కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి పట్టణంలో జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త జూలూరి రమేష్‌బాబు కుటుంబ సభ్యులు తదితరులు ఓటు వేశారు.



పెంట్లవెల్లి మండలం యంగంపల్లితండాలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నామని చూపిస్తున్న యువకులు

సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 27 గ్రామపంచాయతీలలో గతంలో 34 పోలింగ్ కేంద్రాలు ఉండగా నూతన గ్రామ పంచాయతీలలో మరో కొత్తగా 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓట్లు 30 వేల 483 ఓట్లు ఉన్నాయి. ఇందులో మహిళలు 15వేల496 ఓట్లు కాగా పురుషులు 14వేల 987 ఓట్లు ఉన్నాయి. మండలంలో 46 పోలింగ్ బూత్‌లలో ఉప్పరిపల్లి గ్రామంలోని 68 బూత్‌లలో దాదాపు 45 నిమిషాలు ఈవీఎం మొరాయించడంతో వెంటనే టెక్నికల్ సిబ్బంది సమస్యను వెంటనే పరిష్కరించి ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినిమోగించేలా ఏర్పాటు చేశారు. మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు. కంసానిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ ఎస్సై లెనిన్‌తో కలిసి పరిశీలించారు.

● బిజినేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 4వ విడత ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 35 గ్రామ పంచాయతీల పరిధిలో 44 పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకు మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మధ్యాహ్నం తర్వాత ఓటర్ల రాక తగ్గింది. మండలంలో దాదాపు 68 శాతం పోలింగ్ నమోదైనట్లుగా తెలుస్తోంది.

ఊర్కొండ పోలింగ్ 81.31 శాతం

ఊర్కొండ: మండలంలో 81.31 శాతం పోలింగ్ అయినట్లు తహసీల్దార్ చెన్న కిష్టన్న తెలిపారు. మొత్తం 17643 మంది ఓటర్లు ఉండగా 14345 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అదేవిధంగా మండల కేంద్రంతో పాటు రాంరెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లలోని ఈవీఎంలు గంటపాటు మొరాయించడంతో పోలింగ్ నిలిపివేశారు. అనంతరం సరిచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మండలంలోని రేవల్లి గ్రామంలో జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కల్వకుర్తిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న రమేష్‌బాబు కుటుంబ సభ్యులు

మ్రాబాద్ మండలం వెల్మపల్లి గ్రామంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అమ్రాబాద్, పదర మండలాల పరిధిలో ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అమ్రాబాద్, పదర మండలాల్లో కార్యకర్తల ద్వారా ఓటింగ్ వివరాలను తెలుసుకున్నారు. ఈవీఎంలు ఒకటి రెండు ఉదయం కొంత సేపు మొరాయించినా యథావిధిగా పనిచేయడంతో అధికారులు ఊ

యోగించుకున్నారు. ముప్పిడిపల్లిలో రాష్ట్ర ఇరిగేషన్‌డెవలప్‌మెంట్ చైర్మన్ చింతలపల్లి జగదీశ్వర్‌రావు, మహాసముద్రం గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, వెన్నచెర్లలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మరికల్‌లో స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క, మారేడుమానుదిన్నె గ్రామంలో జడ్పీటీసీ సభ్యుడు మేకల గౌరమ్మ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● బల్మూరు: మండలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 41పోలింగ్ కేంద్రాలల్లో 170మంది సిబ్బంది విధులకు హాజరు కాగా 35,207 ఓటర్లు ఉండగా 17300 మహిళలు, 17,727పురుషులు ఓటర్లు ఉన్నారు. 61 శాతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఎన్నికల అధికారి శైలేంద్రకుమార్ తెలిపారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు,

వెంకటేశ్వర్లబావి, పర్హాబాద్, మల్లాపూర్ , తుర్కపల్లి , కొమ్మనపెంట, కొల్లంపెంట తదితర గ్రామాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి అనూరాధ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరిశీలించారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు.

● తెలకపల్లి: మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌ను మండల కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మల్లురవి, భరత్‌ప్రసాద్‌లు పరిశీలించారు. మండల పరిధిలోని గౌరారంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తమ కుటుంబ సభ్యులతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

కొల్లాపూర్, మే 13 : ఎంపీ ఎన్నికల పోలింగ్ మండలంలో సోమవారం ప్రశాంతంగా కొనసాగింది. అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం 7గంటల నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ ఎన్నికల పోలింగ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కన్నా తక్కువగా నమోదు కావడం విశేషం. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో 1000 నుంచి 1100 ఓట్లు ఉండగా కేవలం 550 నుంచి 600లోపే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 55శాతం మాత్రమే పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు. కొల్లాపూర్ మునిసిపాలిటీతోపాటు మండలంలోని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మహేష్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఓటర్లను ఆటోల్లో ప్రైవేట్ వాహనాల్లో తరలించి ఓట్లు వేయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి అరుణ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో తన సతీమణి బీరం విజయతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న జూపల్లి అరుణ్



కొల్లాపూర్‌లో ఆర్ఐడీ పాఠశాల పోలింగ్ స్టేషన్ వద్ద ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్లు, మహిళలు



కొల్లాపూర్‌లో ఎంపీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు



పెంట్లవెల్లిలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



తాడూరులో పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



ఉప్పునుంతలలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వీల్ చైర్‌లో వస్తున్న వృద్ధురాలు



లట్టుపల్లిలో ఓటేసేందుకు క్యూలైన్‌లో నిల్చొన్న గిరిజనులు



రాఘాయిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



వెల్దండలో ఓటుహక్కు వినియోగించుకున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్ టౌన్, మే 13: నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో పార్ల మెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మునిసిపాలిటీ పరిధిలోని 24 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. పట్టణం లోని పలు పోలింగ్ స్టేషన్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఓటర్లు క్యూలైన్ రద్దీ కనిపించింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం బూత్‌లను పటిష్ట బందోబస్తు మధ్య నెల్లికొండ మార్కెట్ యార్డు కలెక్షన్ సెంటర్‌కు తరలించారు.



దేశిటిక్యాలలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు



దేశిటిక్యాలలో ఓటుహక్కు వియోగించుకున్న వృద్ధుడు



నాగర్‌కర్నూల్‌లో ఇంకు మార్కును చూపుతున్న యువతి



ఎట్టిధార్‌పల్లిలో పోలింగ్ బూత్ లేకపోవడం మూలంగా ట్రాలీ వెహికిల్ ద్వారా ఓటు వేసేందుకు వస్తున్న మహిళలు

కాంగ్రెస్‌నే ఆదరించిన ప్రజలు

● కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 13: ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉండి ఆదరించారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని ఓటర్లు ఆశీర్వదించి ఓట్లు వేశారని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూలు మాదిరిగానే తెలంగాణలో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని జీఎస్ఆర్ కార్యాలయంలో జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, పార్లమెంట్ ఎన్నికల కల్వకుర్తి కో-ఆర్డినేటర్ ఇందిరాశోభన్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి గెలుపుకోసం పనిచేసిన పార్టీ శ్రేణులందరికీ, ఓటు వేసిన ప్రజలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ ఇందిరా శోభన్, కల్వకుర్తి మాజీ ససర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలునాయక్, పార్టీ నాయకులు శాన్‌వాజ్‌ఖాన్, రమాకాంత్‌రెడ్డి, జమ్ముల శ్రీకాంత్, సంతుయాదవ్, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాతంగా జరిగింది. మొత్తం 22 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరగగా మొత్తం 64శాతం పెంట్లవెల్లి మండలంలో పోలింగ్ నమోదైంది. వికలాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగించుకునేలా వసతులు కల్పించారు. పెంట్లవెల్లిలో పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

● తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎన్నికల అధికారులు 37 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పోలింగ్ బూత్‌ల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు కొనసాగుతున్న వేళ ఎన్నికల సరళిని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతీ పోలింగ్ కేంద్రం సమీపంలో 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల సరళిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, ఇంద్రకల్, ఐతోల్, సిర్సవాడ, పాపగల్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు.

● ఉప్పునుంతల: పార్లమెంట్ ఎన్నికలు మండలంలో

69.37శాతం పోలింగ్

చారకొండ: మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 17 గ్రామపంచాయతీల్లో మొత్తం 20, 709 ఓటర్లకు గాను 14,366 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. మొత్తం 69.37 శాతం పోలింగ్ అయినట్లు తహసీల్దార్ కేసీ.ప్రమీల తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ఆయా బూత్‌లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. అదేవిధంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ చారకొండలో తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

వెల్మపల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే

● అమ్రాబాద్: పదర, అమ్రాబాద్ మండలాల పరిధిలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ రెండు మండలాలకు సంబంధించిన వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వలస పోయిన ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి తక్కువగానే రావడంతో ఓటింగ్ సరళి మందకోడిగా జరిగింది. అ

పిరి పీల్చుకున్నారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో అమ్రాబాద్ పదర ఎస్ఐలు రమేష్, రాజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలతో పటిష్టంగా భద్రత ఏర్పాట్లు చేశారు.

● వెల్దండ : మండలంలో పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 35 పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచే పోలింగ్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాఘాయిపల్లి గ్రామంలోని కేంద్రం వద్ద రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, వెల్దండలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి మల్లురవి రాఘాయిపల్లి కేంద్రం వద్ద ఎన్నికల సరళిని పరిశీలించారు. అనంతరం వెల్దండలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ఓటింగ్ విధానంపై చర్చించారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వెల్దండలో ఓటింగ్‌ను పరిశీలించి స్థానిక నాయకులతో మాట్లాడారు.

● పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. దేవినేనిపల్లి, చిన్నకార్పాముల, నారాయణపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద చిన్నపాటి ఘర్షణలు జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును విని

కలెక్టర్ చొరవతో తొలిసారి ఓటు వేసిన
ఆదివాసీ చెంచు గిరిజనులు



అంబటిపల్లిలో వృద్ధురాలిని తీసుకువస్తున్న పోలీసులు, అధికారులు

లింగాల, మే 13 : లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో గతంలో 34చెంచుపెంటల్లో 7పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ ఎన్నికల్లో ఆరు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయడంతో 47కు చేరింది. నాగరిక జీవనానికి దూరంగా నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీ చెంచు గిరిజన ఓటర్ల సౌలభ్యం కోసం అదనంగా గతంలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 30వేల 904 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 15,623, పురుషులు 12వేల 280, థర్డ్ జెండర్ ఒకరున్నారు. నేడు అధికారుల పర్యవేక్షణ పోలీసుల బందోబస్తు నిఘాల మధ్య పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభం కాగా మొదటల్లో మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం ఊపందుకుంది. సాయంత్రం నిర్ణీత గడువు 6గంటల వరకు పోలింగ్ జరిగింది. డీఎస్పీ పర్యవేక్షణలో ఎస్ఐ జగన్మోహన్ పటిష్టమైన పోలీస్ పహారా మధ్య మండలంలోని పోలింగ్ సాఫీగా సాగింది. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ తహసీల్దార్ ఉమా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఎన్నికల సిబ్బందికి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మొదటిసారి హక్కు పొందిన ఓటర్లు ఓటు వేయడానికి ఆసక్తి కనబర్చారు. మహిళలు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి క్యూలో నిల్చోలేక మరీ ఓపికతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు సైతం వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశారు. కొత్తగా ఓటు కార్డులను జారీ అయిన లిస్టులో పేరు లేకపోవడంతో ఎన్నికల సిబ్బంది వారికి ఓటు వేయడానికి నిరాకరించారు. నిరాశతో వెనుదిరిగారు. ఓటు అంటే తెలియని నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజనులు తొలిసారిగా నేటి లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును కలెక్టర్ ఉదయ్‌కుమార్ చొరవతో వినియోగించుకున్నారు.

అచ్చంపేటలో 64.88 శాతం పోలింగ్ నమోదు

అచ్చంపేట, మే 13: అచ్చంపేట నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలో 2 లక్షల 47 వేల729 ఓటర్లు ఉండగా మహిళలు లక్షా 24 వేల 598కాగా పురుషులు లక్షా 23 వేల 126 ఓటర్లు ఉండగా, ఇతరులు 5 మంది ఉన్నారు. ఉదయం నుంచి మందకొడిగా పోలింగ్ సరళి సాగింది. ఆ తరువాత పెద్ద ఎత్తున ఓటర్లు తరలి రావడంతో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ సరళి ఉదయం 11 గంటల వరకు 25.32 శాతం మధ్యాహ్నం 1 గంటకు 44.82 శాతం, సాయంత్రం 3 గంటల వరకు 52.86 శాతం 5 గంటల వరకు 62.70 శాతం, 6గంటల వరకు 64.88 పోలింగ్ నమోదు అయింది. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్నికల లో వలస ఓటర్ల ప్రభావం అంతగా కనిపించలేదు. అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. మొత్తం మీద నియోజకవర్గంలో 8 మండలాల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి.



బొమ్మన్‌పల్లిలో బారులు తీరిన ఓటర్లు



మరికల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఇండిపెండెంట్ అభ్యర్థి బర్రెలక్క



వెన్నచెర్లలో ఓటు వేసినట్లు వేలు చూపుతున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్



ముప్పిడిపల్లిలో చింతలపల్లి జగదీశ్వర్‌రావు



మహాసముద్రం గ్రామంలో ఓటు వేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు



ఓటు హక్కు వినియోగించుకొన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్